# మల్లె మొక్క

ఆ రోజు రైలులో జరిగిన సంఘటన గుర్తుకొస్తే ఇప్పటికీ నవ్వు ముంచుకొస్తుంది. తెలుసుకోవాలని కుతూహలంగా వుందా? చదవండి మరి!

ఆ రోజు ఏదో పనిమీద మా వూరికి కొద్దిదూరంలోనే వున్న వూరికి బయలు దేరాను. నేను రైలుఎక్కిన కొద్దిసేపటి లోనే, అదే కంపార్టుమెంటులోకి ఒక తను ఎక్కాడు. చిన్న గోతంలో వున్న ముచ్చట గొలిపే చిన్న మల్లెమొక్కతో సహా! మొక్క చిన్నదయినా రెండు మూడు చిన్న మొగ్గలతో చూడటానికి యింపుగా వుంది. రైలు బయలుదేరిన కొద్దిసేపటికే ఈ క్రింది సంభాషణ వినిపించింది ఆ కంపార్టుమెంటులో.

"ఈ మల్లెమొక్క ఎవరిదండీ?" టికెట్ కలెక్టర్ ప్రశ్నిస్తున్నాడు. తన మల్లెమొక్క చూచి మురిసిపోయి మెచ్చుకుంటున్నాడనుకొని, "ఈ మొక్క నాదేనండీ! విశాఖ పట్టణంలో కొన్నాను. ఇంతకు ముందు ఎన్నిసార్లు వేసినా మా పెరట్లో బ్రతకడం లేదు. ఈసారి అయినా బ్రతుకుతుందనే ఆశతో తెస్తున్నాను. ఈ మొక్క చూస్తే అటువంటి ఆశ కలుగుతోందండి" అంటూ ఏకరువు పెట్టాడు. అతను అంతా విని "అయితే ఈ మొక్క మీదాండీ! దీనికి ఛార్జీ చెల్లించారా?" అని ప్రశ్నించాడు. అతను ఆశ్చర్యపోతూ "అదేమిటండీ! ఈ చిన్న మొక్కకి ఛార్జీయా?" అన్నాడు.

"అయితే కట్టలేదన్నమాట. మొక్కలకి ఛార్జీలేకుండా తీసుకు వెళ్ళటం రైల్వే రూల్సుకి విరుద్ధం. అయినా ఇపుడు మించిపోయిందేమీ లేదు. నా ద్వారా చెల్లించండి, రశీదిస్తాను" అన్నాడు టికెట్ కలెక్టర్.

"ఇంతకు ముందెన్నిసార్లో తీసుకు వెళ్ళాను. ఇటువంటి మాటలు వినలేదు. అయినా ఇంత చిన్న మొక్కకి ఛార్జీ ఏమిటి చెప్పండి" అన్నాడు అతను ప్రక్కనున్న ఇంకొక ఆసామితో.

"ఏమో? నాకేం తెలుసండీ? ఆయనేమో రైల్వే రూల్సు అంటున్నారు. దానికి విరుద్ధంగా నేనేమి చెప్పగలను" అంటూ తప్పుకొన్నాడు ప్రక్కనున్న ఆ ఆసామి.

---

రెండవ బహుమతి రూ. 25/-


ఎమ్. బి. లక్ష్మి

బి. ఎస్‌సి. (మూడవ సంవత్సరం)

సెంట్ జోసెఫ్స్ స్త్రీల కళాశాల.

విశాఖపట్టణం

అతను ఆ ఆసామి వైపు చుర చుర చూసి ముఖం త్రిప్పుకొని కిటికీగుండా బయటకు చూస్తూ కూర్చున్నాడు.

టికెట్ కలెక్టర్ అతని ఎదటి సీట్లో బైఠాయించి ఛార్జీ కట్టమని మళ్ళీ అడిగాడు.

"కట్టను గాక కట్టను" అన్నాడతను ముఖమైనా త్రిప్పకుండా. ఏమి జరుగుతుందా అని చోద్యం చూస్తూ కూర్చున్నారు కంపార్టుమెంటులోని వారు.

టికెట్ కలెక్టర్ ఛార్జీ కట్టమని సతాయిస్తున్నాడు. అతను వినిపించుకోకుండా కూర్చున్నాడు.

కొంత సేపయింది అతను టికెట్ కలెక్టర్ మాటలు భరించలేక పోయి నట్లున్నాడు. "ఇంతకీ మీ రనేదేమిటి?" అన్నాడు కటువుగా.

"ఛార్జీ చెల్లించమంటున్నాను." మొదటి పాట తిరిగి వినిపింప చేశాడు టికెట్ కలెక్టర్.

"అయితేసరే!" అంటూ దురుసుగా ముక్కాలి తీసి నడుస్తున్న బండీ లోంచి బయటకు విసిరి కొట్టాడు. అందరూ నిర్ఘాంత పోయారు అతని సాహసానికి.

కొంతసేపటికి టికెట్ కలెక్టర్ "అదేమయ్యా! అలా విసిరేశావ్!" అన్నాడు ఆశ్చర్యంలోంచి తేరుకుంటూ "నీ పీడ వదలించుకోటానికి" విసురుగా వచ్చింది జవాబు.

"అయితే నా కిచ్చెయ్యలేక పోయావయ్యా" తన కక్కుర్తి బయటపెట్టాడు టికెట్ కలెక్టర్.

"అలా అని మొదటే అఘోరించలేక పోయావ్?"

అంతే! కంపార్టుమెంటులో అందరూ గొల్లున నవ్వారు. టికెట్ కలెక్టర్ ముఖం చూడాలి ఆ సమయంలో!

***

